క్లుప్తంగా

బొగ్గు ఉత్పత్తిలో ఇల్లెందు అగ్రస్థానం

ఇల్లెందు: బొగ్గు ఉత్పత్తిలో ఇల్లెందు ఏరియా అగ్రస్థానంలో ఉందని ఏరియా జీఎం షాలేము రాజు వెల్లడించారు. మంగళవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన అధికారుల సమీక్ష సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ నెలకు నిర్దేశించిన లక్ష్యం 2.60 లక్షల టన్నులకు గానూ 3.48 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తిని చేసి 134 శాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు. అన్ని ఏరియాల కంటే ఇల్లెందు అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ మేరకు ఉద్యోగులను, సూపర్‌వైజర్లను అధికారులను, యూనియన్ నాయకులను అభినందించారు.

విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి

కొత్తగూడెంరూరల్: విద్యుత్ అనేది మౌళికమైన అవసరమని, నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణానికి హానికరమని, విద్యుత్ పరికరాలు వాడుతున్నప్పుడు ప్రమాదాలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు కె.రమేష్ అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని సబ్-స్టేషన్‌లో విద్యుత్ ప్రమాదాలు వాటి నివారణ చర్యలపై అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీరు శేషాద్రి, ఏడిఈ బి.వెంకటరత్నం, రవికుమార్, వేణు, ప్రభాకర్, రఘురామయ్య, బుజ్జి కన్నయ్య పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ఏకలవ్య ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు

కొత్తగూడెంఅర్బన్: ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశం కొరకు నిర్వహించే పరీక్ష హాల్ టిక్కెట్లు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ కె.స్వర్ణలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఈనెల 7న జరుగనున్నదని, ముందస్తుగా హాల్ టిక్కెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఏ సెంటర్‌లో పరీక్ష రాయనున్నారో పరిశీలన చేసుకోవాలని సూచించారు.

టేకులపల్లి ఎంపీడీఓగా వీరబాబు



టేకులపల్లి: టేకులపల్లి నూతన ఎంపీడీఓగా కె.వీరబాబు మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలో మెరుగైన సేవలు అందించేందుకు అందరూ సహకరించాలని, అందరినీ సమన్వయం చేసుకుని మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



విజయం సాధించిన కాసాని లక్ష్మి టీం

సుజాతనగర్: 'కాసాని లక్ష్మి మెమోరియల్' ఆధ్వర్యంలో గత నెల 25 నుంచి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిసాయి. మొత్తం 8 రోజుల పాటు సాగిన ఈ క్రీడల్లో 24 టీములు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో కాసాని లక్ష్మి (సుజాతనగర్), గరీబ్‌పేట టీములు తలపడ్డాయి. 7 ఓవర్లలో కాసాని లక్ష్మి టీం 46 పరుగులు చేయగా, గరీబ్‌పేట నిర్ణీత ఓవర్లలో 44 పరుగులు చేసింది. రెండు పరుగుల తేడాతో కాసాని లక్ష్మి మెమోరియల్ టీం విజయం సాధించి ప్రథమ బహుమతికి సాధించింది.

పింఛన్లు, రేషన్‌కార్డులు అందజేయాలి

సుజాతనగర్: అర్హులైన పేదలకు పింఛన్లు, రేషన్‌కార్డులు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఓబీసీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ జాతీయ మీడియా సెల్ కో ఆర్డినేటర్ కేవీ రంగాకిరణ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి చింతలచెరువు శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి జల్లారపు శ్రీనివాస్, కొత్తగూడెం నియోజకవర్గ కన్వీనర్ నరేంద్రబాబు, చుంచుపల్లి మండలాధ్యక్షుడు రాయడు నాగేశ్వరరావు, మండలాధ్యక్షుడు భూక్యా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

జూలూరుపాడు: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గానికి చెందిన నాయకురాలు బానోత్ విజయ బాయి మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పాపకొల్లు, అన్నారుపాడు తదితర గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, నాయకులు దుద్దుకూరి మధుసూదన్ రావు, యల్లంకి చిన్న నాగేశ్వరరావు, సాయిల కృష్ణయ్య, పోతురాజు నాగరాజు, శ్రీనాథరాజు నాగరాజు, పల్లెపు భద్రయ్య, మందా సురేష్, భూక్యా అమృ పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?!

- ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ లైన్
- గాలిదుమారంతో ఎప్పుడేం జరుగుతుందోనని స్థానికుల ఆందోళన
- అయినా పట్టింపులేనట్లుగా అధికారులు



నివాసాలకు సమీపంలోని విద్యుత్ లైన్



లక్ష్మీదేవిపల్లిలో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

పాల్వంచరూరల్: ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ లైన్.. ఆ తర్వాత అక్కడ ఇళ్లు నిర్మించుకున్నారు. దీంతో ఇళ్ల పైనుంచి విద్యుత్ లైన్ ఉండడంతో గాలిదుమారానికి ఎప్పుడేం జరుగుతోందనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం వారికి మరింత ఆవేదనకు గురిచేస్తోంది. పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి, వీరునాయక్ తండాలో ఇళ్ల పైనుంచి 11కేవీ విద్యుత్ లైన్ వేశారు. డాబాపై నిలబడితే చేతికి అందే ఎత్తులోనే వైర్లు ఉండడం గమనార్హం. ఇందిరానగర్ కాలనీ నుంచి లక్ష్మీదేవిపల్లి, వీరునాయక్‌తండా మీదుగా సీతానగర్ కాలనీ వరకు ఏళ్ల క్రితం విద్యుత్ లైన్ వేశారు. ఆ తర్వాత ఆయా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం జరగడంతో ఈ పరిస్థితి నెలకొంది.

అధికారులు స్పందించాలి...

కొన్నేళ్లుగా ఆయా గ్రామాల్లో ఇళ్ల మీదుగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌లైన్ తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు. అయితే, విద్యుత్ శాఖ అధికారులు స్పందించడంలేదు. లైన్ తొలగించాలన్నా స్తంభాలు మార్చాలన్నా డీడీ చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారు. కానీ స్థానికులు మాత్రం ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి లైన్ మార్చాలని విన్నవిస్తున్నారు.

గతంలో చెప్పినా చేయలేదు..



లక్ష్మీదేవిపల్లిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌లైన్‌ను మార్చాలి. గతంలో లైన్ మారుస్తామని చెప్పిన అధికారులు ఇంకో లైన్ వేసినా ప్రమాదకరంగా ఉన్న తీగలను మార్చకుండా వదిలేశారు. దీంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ప్రతిరోజు భయపడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– లక్ష్మీనారాయణ, లక్ష్మీదేవిపల్లి

టెన్షన్‌తో బతుకుతున్నాం



ఇళ్ల పైనుంచి ఉన్న విద్యుత్‌లైన్ తీగల కారణంగా నిత్యం టెన్షన్‌తో బతుకుతున్నాం. ఇలా విద్యుత్ తీగలు ఉండటం ఎప్పటికైనా ప్రమాదకరమే. అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను తొలిగించాలి. ఈ విషయమై అనేకసార్లు విద్యుత్ శాఖ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు.

– బానోతు కల్పన, లక్ష్మీదేవిపల్లి

డీడీ కడితేనే తొలగింపు



లక్ష్మీదేవిపల్లి నుంచి సీతానగర్ కాలనీ వరకు విద్యుత్ లైన్, స్తంభాలను తొలగించాలంటే డీడీ చెల్లించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం డబ్బు కడితే తప్ప విద్యుత్‌లైన్ మార్చే అవకాశం లేదు. ప్రమాదకరంగా ఉన్న లైన్‌ను తొలగించాలని స్థానికులు కోరుతున్నా, కొత్త లైన్ వేయాలంటే డీడీ కట్టాల్సిందే.

– ప్రతాప్, విద్యుత్‌శాఖ ఏఈ

సమ్మర్ క్యాంప్‌ను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ బలరాం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో కార్పొరేట్ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ కోచింగ్ క్యాంపులో భాగంగా సీఈఆర్ క్లబ్‌లో బాస్కెట్ బాల్ కోర్టును, ప్రకాశం స్టేడియంలో సమ్మర్‌కోచింగ్ క్యాంపును మంగళవారం సింగరేణి డైరెక్టర్ పా ఎన్ బలరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులకు సెలవులు వృథా కాకుండా ఉండేందుకు గాను సింగరేణి వ్యాప్తంగా విద్యార్థులకు సమ్మర్ కోచింగ్ క్యాంపులు కంపెనీ ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్యాంపులో ఆటలోని మెళకువలను తెలుసుకొనేందుకు ఉపకరిస్తుందన్నారు. క్యాంపులో అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, ఫుట్‌బాల్, వాలీబాల్, ఉషు, డ్రాయింగ్‌లకు శిక్షణ ఇవ్వనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

పాల్వంచరూరల్: ప్రతీ ఆదివాసీ గ్రామాల్లో ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అర్చక పురోహిత్ ప్రముఖ్ వోరుగంటి సురుష్‌కుమార్ అన్నారు. మండల పరిధి ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి గ్రామంలో మంగళవారం సమ్మక్క, సారలమ్మ గద్దెలను విశ్వహిందూ పరిషత్ సభ్యులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం విశ్వహిందూ పరిషత్ విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు, ఖమ్మం విభాగ్ అర్చక పురోహిత్ ప్రముఖ్ తేజావత్ రాములు నాయక్, జిల్లా అధ్యక్షుడు చిలుకూరి నాగేశ్వరరావు, జిల్లా సంఘటన కార్యదర్శి చిట్టెంశెట్టి లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి గంగాధరి సీత, సానబోయిన వెంకట్, జిల్లా అర్చక పురోహిత్ ప్రముఖ్ పవన్ కుమార్‌శర్మ, పాల్వంచ ప్రచండ కార్యదర్శి చెంచాని శ్రీనివాసరావు, ప్రఖండ మాతృశక్తి సంయోజిక మందా వెంకటరమణ, రాంబాబులు పాల్గొన్నారు.

మూడు ట్రాక్టర్లు సీజ్

కొత్తగూడెంరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఫారెస్ట్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ కూనారం బీట్ పరిధిలో ఫారెస్టు అధికారులు పెట్రోలింగ్ చేస్తుండగా మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని, ఫారెస్టు కార్యాలయం తరలించి, ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ట్రాక్టర్‌లను సీజ్ చేశారు.

వ్యాధుల నివారణకు సిద్ధంగా ఉండాలి

టేకులపల్లి: కీటక జనిత వ్యాధుల నివారణకు సిద్ధంగా ఉండాలని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్, ఇల్లెందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం సులానగర్ పీహెచ్‌సీలో ఆళ్లపల్లి, సులానగర్, రేగళ్ల పీహెచ్‌సీల సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాబోయే వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు ముఖ్యంగా దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పీహెచ్ఎన్ సత్యవతి, సూపర్‌వైజర్లు నాగుబండి వెంకటేశ్వర్లు, రామచంద్రులు, రమేష్‌బాబు, శ్రీనివాస్ , సిబ్బంది పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమ్మెకు సంఘీభావం

చుంచుపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమను రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ చేపట్టిన సమ్మెకు మంగళవారం పలువురు సంఘీభావం తెలిపారు. ములకలపల్లి, లక్ష్మీదేవిపల్లి, చంద్రుగొండ జెడ్పీటీసీలు నాగమణి, వసంత, వెంకటరెడ్డి, జిల్లా సర్పంచులు సంఘం సభ్యులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం ప్రెసిడెంట్ తోలం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు, అనూష, ప్రధాన కార్యదర్శి బలరాం నాయక్, కార్యదర్శి రాజేందర్, జేపీఎస్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి నరేష్, ఉదయ్, రణదీర్, నర్మద, షర్మిల, రాంబాబు, సురేష్, ప్రశాంత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

టేకులపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల మానసిక, శారీరక ఎదుగుదల, సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కాంపెల్లి మంగతార తెలిపారు. ఈ మేరకు మంగళవారం సింగరేణి, ఐటీడీఏల సహకారంతో ప్రధానమంత్రి ఆది ఆదర్శ గ్రామ యోజన (పీఎంఏఏజీవై) పథకంలో భాగంగా బోడు సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన ప్రీ స్కూల్ మెటీరియల్‌ను ఆమె ప్రారంభించారు. సర్పంచ్ ఇర్ప లక్ష్మీనారాయణ, చింత మంగమ్మ, ఎంపీటీసీ శాంతకుమారి, సూపర్‌వైజర్ కె.సక్కుబాయి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: పట్టణ పరిధి గణేష్‌టెంపుల్ రోడ్డులో, రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను మంగళవారం జేసీబీలతో మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది తొలగించారు. గణేష్‌టెంపుల్ రోడ్డులో 40 ఫీట్ల రోడ్డును డీఎంఎఫ్ నిధులు రూ.2 కోట్లతో నిర్మించనుండగా రోడ్డుకు అడ్డుగా, ఆక్రమణకు గురైన ఉన్న వాటిని తొలగించారు.

వర్షంతో రైతుల ఆందోళన

పాల్వంచరూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో, పొలాల్లో ఉన్న ధాన్యం నిల్వలతో రైతుల ఆందోళన చెందుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీవర్షం కురవడంతో సోములగూడెం, సంగం, రెడ్డిగూడెం గ్రామాల పరిధిలో ధాన్యం నిల్వల స్వల్పంగా తడిశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేగంగా కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



సోములగూడెం కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులపై పరదాలు కప్పుతున్న రైతు

బదిలీ న్యాయమూర్తికి సన్మానం



ముఖేష్‌తో బార్ అసోసియేషన్ సభ్యులు

ఇల్లెందు: ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి జే.ముఖేష్ బదిలీపై బెల్లంపల్లి కోర్టుకు వెళ్తున్నందున ఇల్లెందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మంగళవారం కోర్టు హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయవాదులు సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్, సీనియర్ న్యాయవాదులు, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఇందరా, ఏపీపీలు రుచిత, కుంట శ్రీనివాస్, ఏజీపీ కలువల సుధాకర్, కోర్టు సిబ్బంది, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతకు..

తెలంగాణ ప్రభుత్వం అందజేసిన శ్రమశక్తి అవార్డు గ్రహీత టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్‌కు డీజీఎం పర్సనల్ జీఎం జీవీ మోహన్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మంగళవారం జీఎం కార్యాలయంలో పర్సనల్ విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రంగనాథ్ మరెన్నో అవార్డులు అందుకోవాలని కోరారు. జీఎం ఆఫీస్ ఫిట్ కార్యదర్శి యాదగిరి, సీనియర్ అసిస్టెంట్లు అనిల్, లక్ష్మీనారాయణ, ఉద్యోగులు సాంబయ్య, రాకేష్, కిషోర్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్తమ రైతుకు..

సుజాతనగర్: కొత్తగూడెం డివిజన్ ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో బేతంపూడి గ్రామానికి చెందిన రైతు షేక్ ఖాజామియాను మంగళవారం సన్మానించి రూ.10 వేల నగదును అందజేశారు. ఈ ఏడాది మిర్చి, పత్తి పంటలకు ఖాజామియా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని సాధించగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మెన్ బత్తుల వీరయ్య, ఏడీఏ కరుణశ్రీ, డైరెక్టర్లు తమ్మిశెట్టి అశోక్, దుంపల ఓం ప్రకాశ్, మాలోత్ రాములు, షబ్బీర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తే చర్యలు

జూలూరుపాడు: జిల్లా విద్యాశాఖ అనుమతి లేకుండా వేసవి సెలవుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సమ్మర్ కోచింగ్, స్పెషల్ తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖ అధికారి గుగులోత్ వెంకట్ హెచ్చరించారు. మంగళవారం ఆయన జూలూరుపాడులో విలేకరులతో మాట్లాడారు. సమ్మర్ కోచింగ్, స్పెషల్ తరగతులు అంటూ ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డులు ఏర్పాటు చేయడం, పోస్టింగ్ చేయడంపై సంబంధిత విద్యాసంస్థల నిర్వాహకులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కోతుల నివారణ చర్యలు

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో కోతుల నిర్మూలన పనులకు పంచాయతీ పాలకవర్గం శ్రీకారం చుట్టింది. పంచాయతీ పరిధిలో కోతుల బెడద అధికం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు రోజులుగా పంచాయతీ పరిధిలో కోతులను పట్టుకుంటూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పీఓ చిరంజీవి, కార్యదర్శి షర్మిల పర్యవేక్షించారు.

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం..



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వనమా

చుంచుపల్లి: రైతు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచేదని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని పెనగడపలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు తగిన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, ఎంపీపీ బాదావత్ శాంతి, తహసీల్దార్ వనం కృష్ణ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఏడీఏ కరుణశ్రీ, ఏఓ రాజేశ్వరి, మానిటరింగ్ అధికారి సందీప్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: మండలంలోని రేగళ్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు, ఎంపీపీ భూక్యా సోనా, మార్కెట్‌కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, మండల కో ఆప్షన్ సభ్యులు జక్కుల సుందర్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వజ్జ రాజు, ఆత్మకమిటీ డైరెక్టర్ శేషాద్రి వినోద్, తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ నర్సింహారావు, ఏడీ కరుణశ్రీ, ఏఈఓ లత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లు, సర్పంచ్ అజ్మీర శ్రీరామ్, మాజీ జెడ్పీటీసీ బాదావత్ రామకోటి, బరపటిప్రసాద్, పూర్ణ, చిరంజీవి, దేవరగట్టు శేషగిరిరావు, జాటోత్ బాసు, బిచ్చ, దారావత్ బాలాజీ, భూక్యా కిషన్ రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



చెక్కు పంపిణీ చేస్తున్న రాములునాయక్

జూలూరుపాడు: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. మంగళవారం జూలూరుపాడు ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్‌లో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అమలుపరుస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శారద, వైస్ ఎంపీపీ గాదె నిర్మల, రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ ఎదళ్లపల్లి వీరభద్రం, గిర్దావర్ ఎం.తిరుపతిరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్, చౌడం నరసింహారావు, రాంశెట్టి రాంబాబు, పణితి వెంకటేశ్వర్లు, ఎస్‌కె.మైబూ, తోట శ్రీను, రామిశెట్టి నాగేశ్వరరావు, దేవరకొండ కిరణ్, సర్పంచ్‌లు గుగులోత్ రాందాస్, లావుడ్యా కిషన్ లాల్, బోడా కైక, దొడ్డా వెంకటరామారావు, భూక్యా రాములు, బానోత్ శాంతిలాల్, బోడా శాంతిరామ్, పాల్గొన్నారు.

పేదయువతి వివాహానికి ఎమ్మెల్యే చేయూత

ఇల్లెందు/ఇల్లెందురూరల్: మండలంలోని పోలారం గ్రామపంచాయతీ బొంబాయితండా గ్రామానికి చెందిన బానోత్ సింధు వివాహ మహోత్సవానికి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ తన వంతు సహకారం అందించారు. తండ్రిని కోల్పోయిన సింధు వివాహం గురువారం నిర్వహిస్తుండగా వివాహ వేడుక కోసం బంగారు పుస్తెలతాడు, మెట్టెలు, రూ.5వేలు నగదు అందజేశారు. బీఆర్ఎస్ నేత యలమద్ది రవి పట్టుచీర అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రేణుక, పట్టణ ఉపాధ్యక్షుడు కృష్ణారావు, నబి, ప్రచార కార్యదర్శి రాచపల్లి శ్రీనివాస్, నాయకులు కవిత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలికి నివాళి..

మండలంలోని విజయలక్ష్మినగర్ గ్రామపంచాయతీ అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు తాండ్ర స్వరూప అనారోగ్యంతో మంగళవారం మృతిచెందగా ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఉపసర్పంచ్ తాండ్ర నాగరాజు, మాజీ వైస్‌ఎంపీపీ తాండ్ర లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



తాళిబొట్టు, మెట్టెలు, నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

గ్రామసభ

పాల్వంచరూరల్: మండలపరిధిలోని ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి గ్రామంలో మంగళవారం సర్పంచ్ బానోతు భిక్షం అధ్యక్షతన పీసా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. పంచాయతీలో అంగన్‌వాడీ భవనం నిర్మించాలని, పంచాయతీ భవనం, అర్హులైన పోడుసాగుదారులకు హక్కు పత్రాలు మంజూరుచేయాలని, ఏజెన్సీలో అక్రమ కట్టడాలను నిలిపివేయాలని సభ తీర్మాణాన్ని ఆమోదించింది. ఉపాధ్యక్షుడు వజ్జ వెంకటేశ్వర్లు, పీసా కార్యదర్శి కాలం నర్సింహారావు, ఉపసర్పంచ్ వజ్జ నరేష్, కాలం కనయ్య, పాయం నాగార్జున, వాసు, ఉకే రవి, పాయం నాగేశ్వరరావు, ఎట్టి విశ్వనాథం, గుగులోతు భద్యా పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

సింగరేణి(కొత్తగూడెం): వీఓఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టీవీపీఎస్ సభ్యులు గుండపనేని సతీష్ కోరారు. వీఓఏలు చేపట్టిన దీక్షకు మంగళవారం విభిన్న ప్రతిభావంతుల సంఘం (టీవీపీఎస్) సంఘం సభ్యులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట వీజేఏసీ చైర్మన్ గుండపనేని సతీష్ మాట్లాడగా వీజేఏసీ కన్వీనర్ కాటి నాగేశ్వరరావు, టీవీపీఎస్ ఉపాధ్యక్షుడు ఖాదర్‌బాబ, మండలాధ్యక్షులు కరుణాకర్, అబ్దుల్ నయిం, సాయిబాబా, సేరేష్, నాయకులు రేష్మ, మాదవీ, స్వరూప, మైమున్నీసా, రాజమని, అరుణ, పద్మ, రజిత, సఫియా, సత్యవతి, రమణ, జుహేదా పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ పర్యటన




స్థానిక ప్రజలతో కనకయ్య

టేకులపల్లి: మండలంలోని తొమ్మిదోమైలుతండా పంచాయతీ సాయనపల్లి గ్రామంలో మంగళవారం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పర్యటించారు. గ్రామంలో ప్రతిష్ఠించిన బొడ్రాయిని సందర్శించి బొడ్రాయి వద్ద షెడ్డు నిర్మాణానికి రూ.30 వేలు వితరణగా గ్రామస్తులకు అందజేశారు. గ్రామంలో నీటి కొరత తీవ్రంగా ఉందని మహిళలు, గ్రామస్తులు జెడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే నూతన బోరు నిర్మాణ పనులు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాణోతు భద్రు, శేఖర్, రావూరి సతీష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నవీన్ రాథోడ్‌కు అభినందన

జూలూరుపాడు: మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ బానోత్ నవీన్ రాథోడ్‌ను ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రోహిత్ చౌదరి అభినందించారని మంగళవారం నవీన్ రాథోడ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ల సమావేశానికి ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రోహిత్ చౌదరి ముఖ్యఅతిథిగా హాజరై తనకు ట్యాబ్ అందజేయడంతోపాటు, అభినందించారన్నారు.



అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా మోడుబారిన చెట్టు

ఎండిపోయి మోడుబారిన చెట్టు ప్రమాదకరంగా మారింది. మండలంలోని బంజర గ్రామపంచాయతీ పరిధి కుంజవెంకయ్య గుంపులోని వాటర్ ట్యాంక్ ఎదుట భారీ చెట్టు ఎండిపోయి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిన నెలకొంది. రాకపోకలు సాగించే రహదారి కావడంతో గాలిదుమారం వస్తే చెట్టు కూలిపోయే ప్రమాదం ఉన్నందున.. అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుగానే స్పందించి చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– పాల్వంచ రూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : బి.నారాయణ, మండల పంచాయతీ అధికారి
సెల్ నంబర్ : 9492243772

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గారాంప్రసాద్ - 79979 58226 | టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416
ఎస్. శేషయ్య - 99121 99148